RNI NO. TELTEL2010/34557

www.deshatimes.in

# దేశ టైమ్స్ DESHA TIMES

తెలుగు దిన పత్రిక

నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES

16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | సెప్టెంబర్ 2 బుధవారం 2026 | సంపుటి : 16 | సంచిక : 209 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాష

NALGONDA | WEDNESDAY SEPTEMBER 2 2026 | VOL:16 | ISSUE: 209 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# అంతర్జాతీయవిద్య కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

### మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు అదే ఊపిరి..సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

### విదేశీ పర్యటనపై నివేదిక అందజేసిన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం

### నర్సరీ నుంచే విద్యావ్యవస్థలో సమూల మార్పులు : నివేదికలో వెల్లడి

రాష్ట్ర విద్యార్థులు, యువతకు హైదరాబాద్‌లోనే ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యాలు అందేలా రూపుదిద్దుకుంటున్న ప్రత్యేక 'టాస్క్‌ఫోర్స్'కు తానే స్వయంగా నాయకత్వం వహిస్తానని సీఎం ఏ రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీన్ని వెంటనే అమల్లోకి తేవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యానికి ఇది ఊపిరి పోస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఇటీవల బ్రిటన్, అమెరికా దేశాల్లో పర్యటించేందుకు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి అనుమతి ఇవ్వకపోవడంతో సీఎం లండన్ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు తిరిగి వచ్చేశారు. కానీ తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం తమ పర్యటనను కొనసాగించింది. ఈనేపథ్యంలో సోమవారం ఆ బృందం సీఎం రేవంత్‌రెడ్డికి పర్యటన పూర్తి నివేదికను అందచేసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ విదేశీ పర్యటన, అంతర్జాతీయ వర్సిటీల భాగస్వామ్యం తెలంగాణ యువతరం భవిష్యత్‌కు ఊపిరి పోస్తుందని చెప్పారు. హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ఈ పర్యటన ఉపయోగపడిందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం విదేశీ పర్యటనలో సాధించిన చారిత్రాత్మక పురోగతి, ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థలతో కుదిరిన కీలక ఒప్పందాలు, అవగాహనా ఒప్పందాలు (ఎమ్ఓయూలు), లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ)ల సమగ్ర వివరాలతో కూడిన ప్రత్యేక నివేదికను అందచేసింది. ఐటీ, పరిశ్రమలు, ఫార్మా, లైఫ్ సైన్సెస్, పరిశోధన, డిఫెన్స్ రంగాల్లో రాష్ట్రాన్ని అంతర్జాతీయ విద్యా, నైపుణ్య రంగానికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని కమిటీ తన నివేదికలో పేర్కొంది.అమెరికాలోని అత్యుత్తమ 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ'తో పాటు బ్రిటన్‌లోని 17 స్వతంత్ర విద్యాసంస్థల సమాఖ్య అయిన 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' భారత్‌లోనే తమ తొలి ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు స్పష్టమైన అంగీకారం తెలిపాయని నివేదికలో స్పష్టంచేశారు. నార్త్ ఈస్టర్న్ వర్సిటీ తమ క్యాంపస్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేసే అవకాశాలను ముమ్మరంగా పరిశీలిస్తున్నదనీ, 'హార్వర్డ్ యూనివర్సిటీ' హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎమ్‌సీహెచ్చార్డీ) వేదికగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ రంగ ప్రతినిధుల కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను నిర్వహించేందుకు అంగీకరించినట్టు తెలిపారు. ఈ అంతర్జాతీయ కోర్సులు

(మిగతా 2వ పేజీలో..)



## ఎస్‌సీఓ సదస్సు వేదికగా దాయాది చిల్లర చేష్ట... గ్రూప్ ఫోటోలో మోదీని క్రాప్ చేసిన పాక్




### ఎస్సీఓ సదస్సు గ్రూప్ ఫోటోలో మోదీని తొలగించిన పాక్

### క్రాప్ చేసిన ఫోటోను షేర్ చేసిన పాకిస్థాన్ పీఎంఓ

### ఇది పాక్ చిల్లరబుద్ధికి నిదర్శనమంటూ నెటిజన్ల విమర్శలు

### పాక్ ప్రధానితో ఉన్న పూర్తి ఫోటోను పంచుకున్న భారత్

అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ తన సంకుచిత మనస్తత్వాన్ని మరోసారి చాటుకుంది. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) దేశాధినేతల శిఖరాగ్ర సమావేశం సందర్భంగా తీసిన సామూహిక గ్రూప్ ఫోటో నుంచి భారత ప్రధాని నరేంద్ర మోదీ చిత్రాన్ని తొలగించి (క్రాప్ చేసి) ఆ దేశం ప్రచురించింది. ఈ చర్యపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కిర్గిజ్‌స్థాన్‌లో జరిగిన ఎస్‌సీఓ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్ సమావేశంలో సభ్య దేశాల నేతలందరూ కలిసి గ్రూప్ ఫోటో దిగారు. అయితే, ఈ ఫోటోను పాకిస్థాన్ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పంచుకునే క్రమంలో, అందులో ఉన్న భారత ప్రధాని మోదీని కత్తిరించి పక్కనపెట్టింది. కేవలం పాక్ ప్రధాని

(మిగతా 2వ పేజీలో..)

## ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు: బండి సంజయ్


### తన నియోజకవర్గానికి కేటాయించిన నిధుల్లో 94.1 శాతానికి సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయన్న సంజయ్

### ఏకపక్ష నివేదికలు ఇవ్వడం సరికాదని వ్యాఖ్య

### క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని హితవు

ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంలో పార్లమెంట్ సభ్యులు తీవ్రంగా వెనుకబడ్డారంటూ 'ఎంపవర్డ్ ఇండియన్' సంస్థ విడుదల చేసిన నివేదిక సత్యదూరమని, వాస్తవాలను పరిగణనలోకి

(మిగతా 2వ పేజీలో..)



## రైతు ఇంటికి సీఎం విజయ్.. బామ్మకు సర్‌ప్రైజ్ గిఫ్ట్

### సేలం జిల్లాలో తమిళనాడు సీఎం విజయ్ పర్యటన

### రైతు ఇంట్లో ఆకస్మికంగా ఆగిన ముఖ్యమంత్రి

### సీఎంను చూసి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైన బామ్మ

### తన కళ్లజోడును బామ్మకు బహుమతిగా ఇచ్చిన విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తన పర్యటనలో ఒక రైతు కుటుంబానికి అనూహ్య రీతిలో ఆశ్చర్యాన్ని కలిగించారు.



మంగళవారం సేలం జిల్లాలో పర్యటించిన ఆయన, ఒక గ్రామంలో ఆకస్మికంగా ఆగి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఒక వృద్ధురాలు చూపిన ఆత్మీయతకు ముగ్ధుడైన ఆయన, తాను ధరించిన కళ్లజోడును ఆమెకు బహుమతిగా అందించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సేలం జిల్లాలోని మెట్టూరు డ్యామ్ గేట్లను తెరిచి, సాగునీటిని విడుదల

(మిగతా 2వ పేజీలో..)

## ఏపీ మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్... ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

### త్వరలో ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటన

### మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు వైసీపీ 350 కేసులు వేసిందని విమర్శ

### ఇప్పటివరకు పింఛన్ల రూపంలో రూ.73,000 కోట్లు అందించామని వెల్లడి

ఆంధ్రప్రదేశ్ మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీపి కబురు అందించారు. రాష్ట్రంలో త్వరలో పెద్ద ఎత్తున

(మిగతా 2వ పేజీలో..)



# అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు.. వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత: మంత్రి నారా లోకేశ్

### పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష

### వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పక్కా ప్రణాళికలు

### అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం

### బడిబయట ఉన్న 1.64 లక్షల మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశం

### మధ్యాహ్న భోజనంపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని తల్లిదండ్రులకు, టీచర్లకు సూచన

### ఇంటర్ విద్యార్థులకు 'తల్లికి వందనం' కింద రూ.1051 కోట్ల ఆర్థిక సాయం

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని

(మిగతా 2వ పేజీలో..)



## సింధు జలాల వివాదం.. నీటిని ఆయుధంగా వాడొద్దన్న పాకిస్థాన్ ప్రధాని

### ఎస్‌సీఓ సదస్సులో సింధు జలాల ఒప్పందంపై పాక్ ప్రధాని ప్రస్తావన

### నీటిని రాజకీయ ఆయుధంగా వాడరాదని షెహబాజ్ షరీఫ్ వ్యాఖ్య

### పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపివేసినట్లు స్పష్టం చేసిన ఇండియా

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత్-పాకిస్థాన్ మధ్య సింధు జలాల ఒప్పందం



(మిగతా 2వ పేజీలో..)

RNI NO. TELTEL2010/34557 తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం



## సంపాదకీయం

### ప్రజావాణి.. ప్రజల గొంతుకకు నిజమైన పరిష్కారం ఎప్పుడు?

ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన వేదికల్లో ప్రజావాణి ఒకటి. అధికారులు, ప్రజాప్రతినిధులను కలవడం సాధ్యం కాని సామాన్యులకు తమ సమస్యను వినిపించే అవకాశం ప్రజావాణి ద్వారా లభిస్తోంది. భూ వివాదాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, ఉపాధి, విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు వంటి అనేక అంశాలపై ప్రజలు అధికారులను ఆశ్రయిస్తున్నారు. అయితే ప్రజావాణికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడం కంటే.. వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయి? ఎంతమంది ప్రజలకు న్యాయం జరిగింది? అన్నదే అసలు కొలమానం.ప్రతి వారం ప్రజావాణి నిర్వహించడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత పూర్తయినట్లు కాదు. ప్రజలు తమ సమస్యతో కార్యాలయానికి వచ్చినప్పుడు వారి దరఖాస్తును స్వీకరించడం మొదటి అడుగు మాత్రమే. ఆ దరఖాస్తు ఏ శాఖ పరిధిలోకి వస్తుంది? సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? బాధ్యులైన అధికారి ఎవరు? ఎంత సమయంలో పరిష్కరించాలి? అనే అంశాలపై స్పష్టమైన వ్యవస్థ ఉండాలి. లేకపోతే ప్రజావాణి కూడా మరో సాధారణ ఫిర్యాదుల కేంద్రంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా రెవెన్యూ సంబంధిత సమస్యలు ప్రజలను ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నాయి. భూముల సరిహద్దులు, పట్టాదారు పాసుపుస్తకాలు, వారసత్వ హక్కులు, రికార్డుల మార్పులు వంటి అంశాల్లో చిన్న పొరపాటు కూడా కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇలాంటి సమస్యలను కేవలం దరఖాస్తుగా స్వీకరించి సంబంధిత అధికారులకు పంపడం కాకుండా, వాటి పురోగతిని ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలి.అదే సమయంలో ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలి. ఆధారాలు లేకుండా ఫిర్యాదులు చేయడం, ఒకే సమస్యపై వివిధ కార్యాలయాల్లో పదేపదే దరఖాస్తులు ఇవ్వడం వల్ల అధికార యంత్రాంగంపై అనవసర భారం పడుతుంది. వాస్తవ సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలు, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేస్తే పరిష్కారం వేగవంతమయ్యే అవకాశం ఉంటుంది. సాంకేతికతను మరింత సమర్థంగా ఉపయోగించాల్సిన అవసరం కూడా ఉంది. ప్రతి ప్రజావాణి దరఖాస్తుకు ప్రత్యేక సంఖ్య కేటాయించి, దాని ప్రస్తుత స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశం కల్పిస్తే పారదర్శకత పెరుగుతుంది. దరఖాస్తు ఏ అధికారి వద్ద ఉంది? ఏ దశలో ఉంది? ఎందుకు ఆలస్యమవుతోంది? వంటి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. నిర్ణీత గడువులో పరిష్కరించని దరఖాస్తులపై సంబంధిత అధికారులను ప్రశ్నించే విధానం కూడా ఉండాలి. ప్రజావాణి విజయవంతం కావాలంటే "దరఖాస్తు స్వీకరణ" నుంచి "పరిష్కారం" వరకు ప్రతి దశకు బాధ్యత, గడువు, జవాబుదారీతనం ఉండాలి. ప్రజలు అధికారుల చుట్టూ తిరిగే వ్యవస్థ కాకుండా.. అధికార యంత్రాంగమే ప్రజల సమస్య పరిష్కారం కోసం ముందుకు వెళ్లే విధానం ఏర్పడాలి. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీ వెనుక ఒక కుటుంబం బాధ, ఒక వ్యక్తి ఆశ, ఒక సమస్యకు పరిష్కారం కోసం ఎదురుచూపు ఉంటాయి. అందుకే ప్రజావాణిని కేవలం వారపు కార్యక్రమంగా కాకుండా ప్రజల గొంతుకకు సమాధానం ఇచ్చే బాధ్యతాయుత పరిపాలనా వ్యవస్థగా మార్చినప్పుడే దాని అసలు ఉద్దేశ్యం నెరవేరుతుంది.

# అంతర్జాతీయవిద్య కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రత్యక్షంగా ప్రారంభమవుతాయని వివరించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, లండన్ బిజినెస్ స్కూల్, వర్జీనియా టెక్, ఇంపీరియల్ కాలేజ్ లండన్ వంటి దిగ్గజ విద్యాసంస్థల అధిపతులతో తెలంగాన రైజింగ్ ప్రతినిధి బృందం విస్తృత స్థాయి చర్చలు జరిపినట్టు నివేదికలో పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో సంయుక్త పరిశోధనా కేంద్రాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించామనీ, ఆయా సంస్థల నిపుణుల బృందాలు త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించి ప్రత్యక్షంగా ఇక్కడి వసతులను పరిశీలిస్తాయని తెలిపారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని నివేదిక స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో అంతర్జాతీయ విద్యా కేంద్రం (గ్లోబల్ నాలెడ్జ్ హబ్) ఏర్పాటైతే, మరిన్ని ప్రపంచ స్థాయి మల్టీనేషనల్ కంపెనీలు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ) తెలంగాణకు తరలివస్తాయని చెప్పారు. దీనివల్ల యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయనీ, తయారీ, పరిశోధన రంగాలు వేగంగా వృద్ధి చెందుతాయని వివరించారు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్‌సీహెచ్చార్డీ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, సీఎం సలహాదారు కే రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'లో ప్రపంచ విద్యాసంస్థల భాగస్వామ్యం, క్రీడా రంగ అభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమాన్ని (ట్రాక్) నిర్వహిస్తామని తెలిపారు.

## ఏపీ మహిళలకు చంద్రబాబు గుడ్ న్యూస్... ఏసీ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

మొదటి పేజీ తరువాయి)

అందుబాటులోకి రానున్న ఏసీ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు. మొగల్తూరులో నిర్వహించిన 'ఎన్టీఆర్ భరోసా' సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఈ కీలక ప్రకటన చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తోందని పేర్కొన్నారు. సంక్షేమంతో కూడిన అభివృద్ధే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పింఛన్ల రూపంలోనే ప్రజలకు రూ. 73,000 కోట్లు అందించినట్లు గుర్తుచేశారు. మహిళలు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారి కష్టాలను తీర్చేందుకే 'దీపం' పథకాన్ని తీసుకువచ్చామని వివరించారు. ఇదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మెగా డీఎస్సీని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఏకంగా 350 కేసులు వేశారని ఆరోపించారు. ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్రంలో అభివృద్ధిని ఆపలేరని హితవు పలికారు. కేవలం ప్రజల ప్రయోజనాల కోసమే కూటమి పార్టీలు ఏకమయ్యాయని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ముందుకు సాగుతోందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

## ఎస్‌సీఓ సదస్సు వేదికగా దాయాది చిల్లర చేష్ట... గ్రూప్ ఫోటోలో మోదీని క్రాప్ చేసిన పాక్

మొదటి పేజీ తరువాయి)

షెహబాజ్ షరీఫ్, ఇతర నేతలు ఉన్న భాగాన్ని మాత్రమే ప్రచురించింది. మరోవైపు, భారత్ మాత్రం ఈ విషయంలో ఎంతో హుందాగా వ్యవహరించింది. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో సహా నేతలందరూ ఉన్న పూర్తి ఫోటోను అధికారికంగా విడుదల చేసింది. ఈ రెండు ఫోటోలను పోలుస్తూ నెటిజన్లు పాకిస్థాన్ తీరుపై మండిపడుతున్నారు. ఇది పాక్ ప్రదర్శించిన సంకుచిత వైఖరి అని, వారి దిగజారుడు మనస్తత్వానికి ఇది నిదర్శనమని సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు.. వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత: మంత్రి నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి)

అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు.ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

**బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలి**

పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే 33 వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను 'లీప్' యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపామని పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల హాజరు శాతం 98.97 శాతంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా పెంచాలని సూచించారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, ఈ బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీలకు అప్పగించాలని స్పష్టం చేశారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యతపై రాజీ లేదు**

మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నాణ్యతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు 'లీప్' యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ అందించాలని కోరారు. అలాగే, విద్యార్థుల్లో ఒత్తిడి లేని అభ్యసన వాతావరణాన్ని కల్పించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు 'ఏఐ సమర్థ్' కార్యక్రమం చేపడుతున్నామని, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 192 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల కోసం 'మిషన్ మార్చి-2026'పై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సింధు జలాల వివాదం.. నీటిని ఆయుధంగా వాడొద్దన్న పాకిస్థాన్ ప్రధాని

మొదటి పేజీ తరువాయి)

వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. మంగళవారం ఈ అంశాన్ని ప్రస్తావించిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజకీయ అస్త్రంగా మలుచుకోకూడదని భారత్‌ను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ఒప్పందాలను వాటి అసలు స్ఫూర్తికి అనుగుణంగా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు.హేగ్‌లోని శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం సింధు జలాల ఒప్పందం చెల్లుబాటును సమర్థిస్తూ, వివాద పరిష్కార యంత్రాంగం కొనసాగుతుందని తీర్పు వెలువరించిన మరుసటి రోజే షెహబాజ్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.అయితే, ఈ న్యాయస్థానం తీర్పును భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. అసలు, ఆ కోర్టు ఏర్పాటే చట్టవిరుద్ధమని, దాని పరిధిని తాము గుర్తించబోమని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. సదరు ట్రైబ్యునల్ విచారణలో భారత్ పాల్గొనలేదని, ఆ తీర్పులు తమ జలవిద్యుత్ ప్రాజెక్టులపై ఎలాంటి ప్రభావం చూపబోవని తేల్చిచెప్పింది.2025 ఏప్రిల్‌లో జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. తాజా తీర్పు వెలువడినప్పటికీ, ఈ విషయంలో తన వైఖరిలో ఎలాంటి మార్పు లేదని భారత్ పునరుద్ఘాటించింది. ఇదే ఎస్‌-సీఓ సదస్సులో ప్రసంగించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించడం తగదని హెచ్చరించారు. ఉగ్రవాదానికి అందుతున్న నిధులు, నియామకాలు, సురక్షిత స్థావరాలను కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. ఈ పరిణామాలతో భారత్-పాకిస్థాన్ మధ్య ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతల మధ్య సింధు జలాల వివాదం మరోసారి కీలక అంశంగా మారింది.

### ఎంపీ లాడ్స్ నిధుల వినియోగంపై అభాండాలు వేయడం సరికాదు: బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి)

తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. ఈ మేరకు తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు వివరాలను ఆయన గణాంకాలతో సహా మీడియాకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ. 17.50 కోట్లు కేటాయించగా, అందులో ఏకంగా 94.1 శాతం నిధులకు (రూ. 16.47 కోట్లు) సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని స్పష్టం చేశారు. కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, సీసీ రోడ్ల వంటి ప్రజావసరాల కోసం గత మూడేళ్లలో 627 ప్రతిపాదనలను కలెక్టర్లకు పంపగా, వాటిలో 82.29 శాతం పనులకు ఇప్పటికే ఆమోదం లభించిందన్నారు. అంతేకాకుండా, గతంలో 16వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్న బి. వినోద్ కుమార్ ఖర్చు చేయకుండా వదిలేసిన రూ. 2.5 కోట్ల నిధులను కూడా తానే ఉపయోగించినట్లు గుర్తుచేశారు.స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్రం ఇచ్చే నిధులు చాలడం లేదని, ప్రతి ఏటా ఎంపీ లాడ్స్ కోటాను పెంచాలని ఎంపీలంతా విజ్ఞప్తి చేస్తున్న తరుణంలో ఇలాంటి ఏకపక్ష నివేదికలు ఇవ్వడం అన్యాయమని సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కేటాయింపు నుంచి కలెక్టర్ల ఆమోదం, పనుల అమలు వరకు అనేక దశలు ఉంటాయని... ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ నిధులన్నీ ప్రాసెస్ అయ్యాయని తెలిపారు. ప్రజల విజ్ఞప్తుల కోసం సీఎస్ఆర్ నిధులను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇకనైనా వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని సదరు సంస్థకు హితవు పలికారు.

## రైతు ఇంటికి సీఎం విజయ్.. బామ్మకు సర్‌ప్రైజ్ గిఫ్ట్

మొదటి పేజీ తరువాయి)

చేసే క్రమంలో ముఖ్యమంత్రి విజయ్ అక్కడికి చేరుకున్నారు. కార్యక్రమం ముగించుకుని చెన్నైకి తిరుగుప్రయాణమైన ఆయన, మార్గమధ్యలోని చిన్నకావూరు గ్రామం వద్ద తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. నేరుగా రామస్వామి అనే రైతు నివాసానికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పలకరించారు.ముఖ్యమంత్రి స్వయంగా తమ ఇంటికి రావడంతో ఆ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షాతిరేకలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఒక వృద్ధురాలు ముఖ్యమంత్రిని చూడగానే అమితానందానికి లోనయ్యారు. ఆత్మీయంగా ఆయన్ను ఆలింగనం చేసుకుని, చేతిని గట్టిగా పట్టుకుని తన అనురాగాన్ని చాటుకున్నారు. అనంతరం తన పెరట్లోని తోటను ఆయనకు చూపించారు. ఆమె అభిమానానికి చలించిన విజయ్, తక్షణమే తాను ధరించిన కళ్లజోడును తీసి ఆమెకు బహుమతిగా ఇచ్చారు. ఆ తర్వాత గ్రామంలోని వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేసి అక్కడి నుంచి నిష్క్రమించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, విజయ్ ఆ బామ్మకు బహూకరించిన సన్ గ్లాసులు వరల్డ్ క్లాస్ సంస్థ 'క్రిస్టియన్ డయోర్' తయారు చేసినవి. వీటి ధర రూ.50 వేలకు పైనే ఉంటుంది.

RNI NO . TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం
సెప్టెంబర్ । బుధవారం । 2 । 2026



# మొక్కలు నాటారు.. నీళ్లు పోయడం మరిచారు!







**వనమహోత్సవం పేరుతో హడావుడి.. సంరక్షణపై మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం?**

**ఆర్టీసీ బస్టాండ్‌లో ఎండిపోతున్న మొక్కలు.. అధికారుల తీరుపై పట్టణవాసుల ఆగ్రహం**

**దేశ టైమ్స్‌మహబూబాబాద్/మరిపెడమరిపెడ, సెప్టెంబర్ 1:**

వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాల్సిన అధికారులు, ఆ మొక్కల సంరక్షణను మాత్రం గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ మొక్కలు నాటారు. కార్యక్రమం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కల పెంపకంపై పలు సూచనలు చేసినప్పటికీ.. కార్యక్రమం ముగిసిన తర్వాత వాటి పరిస్థితిని పట్టించుకునే వారు కరువయ్యారనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.

**నాటిన మొక్కలకు నీరేది.. ?**

వనమహోత్సవం సందర్భంగా నాటిన మొక్కలు ప్రస్తుతం నీరు అందక ఎండిపోతున్నాయి. మొక్కలు నాటిన రోజున ఫొటోలు, ప్రచారానికి ప్రాధాన్యత ఇచ్చిన అధికారులు.. అనంతరం వాటికి క్రమం తప్పకుండా నీరు అందించే విషయాన్ని మరిచిపోయారని స్థానికులు మండిపడుతున్నారు. మొక్కలు చిన్నవిగా ఉన్న సమయంలో తగినంత నీరు అందకపోతే అవి ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిసినా సంబంధిత సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.మొక్కలు నాటడం ఒక్కటే వనమహోత్సవం లక్ష్యం కాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెంచడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడమే అసలు ఉద్దేశమని పట్టణవాసులు పేర్కొంటున్నారు. అధికారులు మాత్రం మొక్కలు నాటే కార్యక్రమాలపై చూపిన శ్రద్ధ వాటి సంరక్షణపై చూపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టణంలో పచ్చదనం కోసం నాటిన మొక్కలే.**

ఆర్టీసీ బస్టాండ్ వంటి ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో మొక్కలు పెరిగితే ప్రయాణికులకు, స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు చెట్లు ఎంతో ఉపయోగపడతాయి. ఇలాంటి ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అయితే ప్రస్తుతం నాటిన మొక్కలకు నీరు అందక అవి వాడిపోతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు ఎండిపోయిన తర్వాత మళ్లీ కొత్త మొక్కలు నాటడం కంటే.. ఇప్పటికే నాటిన మొక్కలను కాపాడటానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రచారానికే పరిమితమా?**

వనమహోత్సవం కార్యక్రమాల సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తుంటారు. కానీ ఆచరణలో మాత్రం నాటిన మొక్కల సంరక్షణపై నిర్లక్ష్యం కనిపిస్తే ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించడం ఎంత ముఖ్యమో.. వాటికి క్రమం తప్పకుండా నీరు అందించడం, రక్షణ కల్పించడం, వాటి ఎదుగుదలను పర్యవేక్షించడం కూడా అంతే ముఖ్యమని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించాలి ఇప్పటికైనా మరిపెడ మున్సిపల్ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండ్‌లో వనమహోత్సవం సందర్భంగా నాటిన మొక్కల పరిస్థితిని పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. వెంటనే నీటి సౌకర్యం కల్పించి, మొక్కలు ఎండిపోకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించే బాధ్యతను సిబ్బందికి అప్పగించి, వాటి సంరక్షణపై పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. మొక్కలు నాటడం కార్యక్రమంతో బాధ్యత ముగియకుండా.. అవి చెట్లుగా ఎదిగే వరకు సంరక్షిస్తేనే వనమహోత్సవానికి అసలైన సార్థకత చేకూరుతుందని మరిపెడ పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

# వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు

**తక్కువ నీటితో అధిక దిగుబడి, ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి సారించాలి**

**గిరిపురం రైతు వేదికలో ఆత్మ శిక్షణ కార్యక్రమం.. రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు**

**దేశ టైమ్స్‌మహబూబాబాద్‌మరిపెడ, సెప్టెంబర్ 1:**

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని, తక్కువ నీటితో సాగు చేసే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. ఎల్‌నినో వంటి వాతావరణ ప్రభావాల కారణంగా వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించడంతో పాటు పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకునేలా పంటల సాగు చేపట్టాలని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలోని గిరిపురం రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఆత్మ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)కు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరై రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, విత్తనాల ఎంపిక, పంటల వైవిధ్యీకరణ, నీటి పొదుపు, పెట్టుబడి తగ్గింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సొంత విత్తనాలతో సాగు చేసుకుంటే ఖర్చు తగ్గుతుంది

ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు ప్రతి పంట కాలంలో మార్కెట్ నుంచి విత్తనాలు కొనుగోలు చేయడం వల్ల అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. నాణ్యమైన పంట నుంచి మంచి లక్షణాలు కలిగిన విత్తనాలను ఎంపిక చేసుకుని, శాస్త్రీయ పద్ధతిలో భద్రపరుచుకుని తదుపరి పంట కాలంలో వినియోగించుకోవాలని సూచించారు.రైతులు సాంప్రదాయ పద్ధతుల్లో పండిస్తున్న వరి పంటలో నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని సంరక్షించుకుంటే విత్తనాల కొనుగోలు ఖర్చును గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. సరైన పద్ధతిలో ఎంపిక చేసి నిల్వ చేసిన విత్తనాలను తదుపరి పంటకు వినియోగించడం వల్ల పంట దిగుబడిలో పెద్దగా మార్పు ఉండదని వివరించారు. అయితే విత్తనాల ఎంపిక, నిల్వ, శుద్ధి వంటి అంశాల్లో శాస్త్రీయ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

తక్కువ నీటితో పంటల సాగు

ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని దిలీప్‌కుమార్ సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అధిక నీటి అవసరం ఉన్న పంటల కంటే తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు.ముఖ్యంగా పెసర, మినుములు, నువ్వులు వంటి అపరాల పంటలతో పాటు వివిధ రకాల కూరగాయ పంటలను సాగు చేయడం వల్ల తక్కువ నీటితో పంటలను పండించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దీంతో నీటి వినియోగం తగ్గడంతో పాటు పెట్టుబడి వ్యయం కూడా తగ్గుతుందని, పంటల వైవిధ్యీకరణ ద్వారా రైతులకు అదనపు ఆదాయ మార్గాలు ఏర్పడతాయని వివరించారు.

పామాయిల్ సాగుతో దీర్ఘకాలిక ఆదాయం

ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్, కూరగాయలు తదితర ఉద్యాన పంటలను సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. పామాయిల్ సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం వివిధ రకాల సబ్సిడీ, ప్రోత్సాహకాలను అందిస్తోందని తెలిపారు.రైతులు తమ భూమి స్వభావం, నీటి వసతి, వాతావరణ పరిస్థితులను పరిశీలించి ఉద్యానశాఖ అధికారుల సలహాలతో పామాయిల్ సాగు చేపట్టాలని సూచించారు. పామాయిల్ తోటలను శాస్త్రీయ



పద్ధతుల్లో నిర్వహించడంతో దీర్ఘకాలికంగా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువుల బుకింగ్‌కు ఎఫ్ఎఫ్ఎస్ యాప్

వ్యవసాయశాఖ అధికారి వీరాసింగ్ మాట్లాడుతూ.. రైతులు యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల కోసం ఇబ్బందులు పడకుండా ముందస్తుగా బుకింగ్ చేసుకునే విధానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్‌ను రైతులు తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని, అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను బుక్ చేసుకోవాలని తెలిపారు.ఎరువుల కోసం చివరి సమయంలో ఆందోళన చెందకుండా పంట అవసరాలకు అనుగుణంగా ముందుగానే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. రైతులు ఎరువులను శాస్త్రీయ సిఫార్సుల మేరకు మాత్రమే వినియోగించాలని, అధిక మోతాదులో ఎరువులు వాడటం వల్ల పెట్టుబడి పెరగడంతో పాటు నేల సారవంతతపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.

శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి

ఆత్మ శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో పంటల ఎంపిక ఎలా ఉండాలి, తక్కువ నీటితో పంటలను ఎలా సాగు చేయాలి, విత్తనాలను ఎలా ఎంపిక చేసుకుని భద్రపరచాలి, ఎరువులను ఏ విధంగా వినియోగించాలి తదితర అంశాలను శాస్త్రవేత్తలు వివరించారు.అనంతరం రైతులు తమ సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు, పంటలకు సంబంధించిన సందేహాలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురాగా.. వారు పలు సూచనలు, సలహాలు అందించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యుడు, ఆత్మ సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), రైతులు తదితరులు పాల్గొన్నారు. రైతులకు శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

# దొరికితేనే దందా.. లేదంటే దర్జాగా?

- మరిపెడలో రేషన్ బియ్యం అక్రమ నిల్వపై కలకలం
- భారీగా నిల్వ చేసిన బియ్యం స్వాధీనం



**దేశ టైమ్స్‌మహబూబాబాద్/మరిపెడ సెప్టెంబర్ 1**

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోందనే ఆరోపణలు మరిపెడ మండలంలో కలకలం రేపుతున్నాయి. ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమంగా సేకరించి నిల్వ చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీలర్ల నుంచి నేరుగా దళారుల చేతుల్లోకి బియ్యం చేరుతోందని, అనంతరం దాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.మరిపెడ మండల కేంద్రంలో ఓ ఇంట్లో భారీగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం ఈ ఆరోపణలకు మరింత బలం చేకూర్చింది. సుమారు 500 బస్తాల రేషన్ బియ్యం ఒకే చోట నిల్వ ఉన్నట్లు సమాచారం వెలుగులోకి రావడంతో అధికారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. భారీ మొత్తంలో బియ్యం నిల్వ ఉండటంతో ఈ వ్యవహారం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

**పేదోడి బియ్యంపై దళారుల కన్ను**

ప్రభుత్వం పేద కుటుంబాలకు అందించే రేషన్ బియ్యం వారికి ఆహార భద్రత కల్పించేందుకు ఉద్దేశించినది. అయితే కొందరు అక్రమార్కులు పేదల నుంచి బియ్యాన్ని సేకరించి దళారుల ద్వారా పెద్ద మొత్తంలో నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డీలర్ల స్థాయి నుంచే బియ్యం పక్కదారి పడుతోందా? లేక లబ్ధిదారుల నుంచి సేకరించి అక్రమంగా నిల్వ చేస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో రేషన్ బియ్యం కొనుగోలు, తరలింపు వ్యవహారం జరుగుతోందనే ప్రచారం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో నిఘా పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించి భారీగా బియ్యం పట్టుబడుతున్నా, దాని వెనుక ఉన్న అసలు నెట్‌వర్క్‌ను గుర్తించడంలో అధికారులు విఫలమవుతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పట్టుబడితేనే చర్యలా?**

రేషన్ బియ్యం అక్రమ నిల్వపై సమాచారం బయటకు వచ్చిన తర్వాతే అధికారులు స్పందిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ముందస్తుగా నిఘా ఏర్పాటు చేసి అక్రమ నిల్వ కేంద్రాలను గుర్తిస్తే పెద్ద మొత్తంలో బియ్యం పక్కదారి పట్టకుండా అడ్డుకోవచ్చని స్థానికులు అంటున్నారు. ఒక చోట వందలాది బస్తాలు నిల్వ ఉన్నా అధికారుల దృష్టికి రాకపోవడం ఎలా సాధ్యమైందనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.ఇదిలా ఉండగా, అక్రమ బియ్యం దందాకు కొందరు మధ్యవర్తులు, దళారులు పాల్పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉంది? బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలించేందుకు సిద్ధం చేశారు? గతంలో కూడా ఇదే తరహాలో బియ్యం తరలించారా? అనే అంశాలపై లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

**పోలీసుల దృష్టి సారించాలి**

రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణా వ్యవహారంపై మరిపెడ పోలీస్ యంత్రాంగం కూడా ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ శాఖ స్వాధీనం చేసుకున్న బియ్యం వ్యవహారంపై విచారణను మరింత విస్తృతం చేసి, అక్రమ దందా వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అదేవిధంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించి మరిపెడ మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం బియ్యం పట్టుకుని సీజ్ చేయడంతోనే వ్యవహారం ముగించకుండా, దాని మూలాలను గుర్తించి అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని అంటున్నారు.

‘పేదోడి బియ్యం.. పేదోడికే చేరాలి’

రేషన్ బియ్యం అక్రమంగా చేతులు మారకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న బియ్యం దళారుల చేతుల్లోకి వెళ్లకుండా డీలర్ల వద్ద నుంచి లబ్ధిదారుల వరకు సరఫరా వ్యవస్థను పటిష్టంగా పర్యవేక్షించాలని కోరుతున్నారు.“పేదల కోసం ఇచ్చే బియ్యం పేదలకే చేరాలి. అక్రమంగా నిల్వ చేసి సొమ్ము చేసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఒక్కసారి బియ్యం పట్టుబడిన తర్వాతే చర్యలు తీసుకోవడం కాకుండా, అక్రమ దందా మూలాలను గుర్తించి పూర్తిగా అరికట్టాలి” అనిమరిపెడ మండల ప్రజలు కోరుతున్నారు.

RNI NO . TELTEL2010/34557 తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# కలెక్టర్‌ను కలిసిన వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చ**





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 1 (దేశ టైమ్స్):**

వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ను కోరారు.మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.ను ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందజేశారు.నియోజకవర్గంలోని మౌలిక వసతుల అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం, ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై ఎమ్మెల్యే కలెక్టర్‌తో చర్చించారు. ప్రజల అవసరాలు, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించి, నిబంధనల మేరకు అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ దివాకర టి.ఎస్. ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

# బోనకల్లులో రెండు చేతిపంపులు ప్రారంభం

- **తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం: సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**
- **నీటి కోసం ఏ కుటుంబం ఇబ్బంది పడకూడదు: ఎర్నెస్ట్ పాల్**

**బోనకల్లు, సెప్టెంబర్ 1 (దేశ టైమ్స్):**




గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను తగ్గించేందుకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బోనకల్లు గ్రామంలో రెండు చేతిపంపులను ఏర్పాటు చేసి ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి అవసరాలను గుర్తించి చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ.. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటమే లక్ష్యంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్లు, చేతిపంపులు ఏర్పాటు చేసి నీటి ఎద్దడిని తగ్గించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తాగునీటి సమస్యను గుర్తించి సేవా సంస్థలు ముందుకు వచ్చి సహకరించడం అభినందనీయమన్నారు.గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధి ఎర్నెస్ట్ పాల్ మాట్లాడుతూ.. తాగునీరు ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని, నీటి కోసం ఏ కుటుంబం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. బోనకల్ గ్రామపంచాయతీ సహకారంతో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన చోట బోర్లు, చేతిపంపులు ఏర్పాటు చేసేందుకు తమ సంస్థ సహకారం కొనసాగిస్తుందని అన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడమే తమ సంస్థ లక్ష్యమని ఎర్నెస్ట్ పాల్ తెలిపారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ, గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు జాను, ఎస్. నరేష్, పాస్టర్ మోహన్, బోనకల్ సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పెద్దలు గాలి దుర్గారావు, నందమూరి సత్యనారాయణ, యార్లగడ్డ రమేష్, గుగులోతు నాగేశ్వరరావు, గంగుల పుల్లయ్య, బానోతు రాజు నాయక్, గుగులోతు స్వామి, బాధావతు గాంగు, బానోతు మురళి, బుక్య శ్రీను, బోడ యోగి శ్రీనివాస్, గోపి తదితరులు పాల్గొన్నారు.అలాగే గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు యార్లగడ్డ కుమారి, మరిధు శేషు, అంతోటి శ్రీను, అంతోటి సునీత, షేక్ మేరా సాహెబ్, జరుపల లావణ్య, తాలూరి జ్యోతి, ఉప్పర శీను, షేక్ నౌషిన్తో పాటు మహిళలు బానోతు వెంకమ్మ, బోడ బదిలీ, బానోతు లక్ష్మి, గుగులోతు దూది, భుఖ్య ప్రణీత మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.రెండు చేతిపంపులు అందుబాటులోకి రావడంతో గ్రామంలో తాగునీటి సమస్య కొంతమేర తగ్గుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# మేకల దొంగల ముఠా అరెస్ట్





- **పోలీసుల వాహన తనిఖీల్లో చిక్కిన నలుగురు.. కానిస్టేబుల్‌ను ఢీకొట్టేందుకు యత్నం**
- **కారులో కుక్కి తరలిస్తున్న ఏడు మేకలు స్వాధీనం.. హోండా అమేజ్ కారు, మూడు సెల్‌ఫోన్లు సీజ్**
- **మరిపెడ పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ శబరిష్ పి. ఐపీఎస్, తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్**

**దేశ టైమ్స్మహబూబాబాద్/మరిపెడ: సెప్టెంబర్ 1**

రాత్రివేళల్లో కారులో సంచరిస్తూ ఇళ్ల వద్ద కట్టేసిన మేకలను అపహరించి కారులో కుక్కి తరలిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను మరిపెడ పోలీసులు పట్టుకున్నారు. వాహన తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా వేగంగా వెళ్తున్న కారును పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. నిందితులు కారును ఆపకుండా వేగంగా దూసుకెళ్లడమే కాకుండా పోలీస్ కానిస్టేబుల్‌ను ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. అప్రమత్తమైన కానిస్టేబుల్ పక్కకు తప్పుకోవడంతో ప్రాణాపాయం తప్పి, చేతికి గాయాలయ్యాయి. అనంతరం పోలీసులు చాకచక్యంగా కారును వెంబడించి అడ్డుకుని నలుగురు నిందితులను అరెస్టు చేశారు.మరిపెడ సీఐ ఎల్. పవన్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున సుమారు 2.30 గంటల సమయంలో పెట్రోలింగ్‌లో భాగంగా మరిపెడ రాజీవ్ సెంటర్ వద్ద ఎస్ఐ గంద్రాతి సతీష్, కానిస్టేబుల్ జి. రవితేజ వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో కురవి వైపు నుంచి మరిపెడ వైపు ఓ తెల్లని హోండా అమేజ్ కారు అత్యంత వేగంగా వచ్చింది. కారు ముందు, వెనుక నంబర్ ప్లేట్లకు గుడ్డలు కట్టి నంబరు కనిపించకుండా చేయడంతో పోలీసులకు అనుమానం వచ్చింది.పోలీసులు కారును ఆపేందుకు ప్రయత్నించినా డ్రైవర్ ఆపకుండా వేగంగా దూసుకెళ్లాడు. దీంతో పోలీసులు వాహనాన్ని వెంబడించారు. సుమారు 150 కిలోమీటర్ల వేగంతో మరిపెడ పట్టణం నుంచి కార్గిల్ సెంటర్, సూర్యాపేట రోడ్డువైపు వెళ్లిన కారు.. అక్కడి నుంచి మళ్లీ మరిపెడ వైపు మలుపు తీసుకుని తిరిగి సూర్యాపేట హైవేపైకి చేరుకుని సూర్యాపేట వైపు దూసుకెళ్లింది.పోలీసు వాహనం సైరన్ మోగిస్తూ, హారన్ కొడుతూ కారును నిలిపేందుకు ప్రయత్నించినా నిందితులు పట్టించుకోలేదు. కారులో అనుమానాస్పద వస్తువులు ఉండటంతోపాటు నంబర్ ప్లేట్లను గుడ్డలతో కప్పి ఉంచడం పోలీసుల అనుమానాలను మరింత బలపరిచింది. అంతేకాకుండా ఇంతటి వేగంతో హైవేపై ప్రయాణిస్తే ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టి ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఎలాగైనా కారును అడ్డుకోవాలని నిర్ణయించారు.ఈ క్రమంలో తానంచర్ల గ్రామ శివారులో ఎస్ఐ సతీష్ పోలీసు వాహనాన్ని నిందితుల కారుకు ముందుగా ఉంచి నిలిపేందుకు ప్రయత్నించారు. నిందితులు కారును కొద్దిసేపు నెమ్మదించడంతో పోలీసు వాహనం వెనుక సీటులో ఉన్న కానిస్టేబుల్ జి. రవితేజ కుడివైపు డోర్ తెరిచి కిందకు దిగారు. డ్రైవర్‌ను కారు దిగి రావాలని చేతితో సంకేతం ఇచ్చారు. అయితే నిందితులు ఒక్కసారిగా కారును వేగంగా ముందుకు నడిపిస్తూ కానిస్టేబుల్ రవితేజపైకి దూసుకెళ్లారు.అప్రమత్తమైన కానిస్టేబుల్ పక్కకు తప్పుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే కారు తగలడంతో ఆయన కుడి చేతికి గాయమైంది. వెంటనే పోలీసు అధికారులు గాయపడిన కానిస్టేబుల్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆయన అప్రమత్తంగా వ్యవహరించకపోయి ఉంటే కారు ఢీకొని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉండేదని పోలీసులు తెలిపారు.అనంతరం పోలీసులు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేయడంతో నిందితులు కొంతదూరం వెళ్లి తానంచర్ల గ్రామ శివారులో కారును నిలిపారు. పోలీసులు కారును తనిఖీ చేయగా నలుగురు వ్యక్తులు ఉండగా.. వారి మధ్యలో ఏడు మేకలను కుక్కి తరలిస్తున్నట్లు గుర్తించారు. మేకలపై ఇద్దరు వ్యక్తులు కాళ్లతో తొక్కుతూ కూర్చున్న పరిస్థితిని చూసి పోలీసులు అవాక్కయ్యారు.మేకలు ఎక్కడివి? కారును ఎందుకు ఆపకుండా తప్పించుకునేందుకు ప్రయత్నించారు? అనే విషయాలపై పోలీసులు నిందితులను ప్రశ్నించగా.. వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానం మరింత బలపడింది. పోలీసుల వద్ద ఉన్న ట్యాబ్, పాపిలాన్ డివైజ్ ద్వారా నిందితుల వేలిముద్రలను పరిశీలించారు.విచారణలో భూక్యా జగదీష్‌పై గతంలో భూర్గంపాడు, నర్సంపేట, డోర్నకల్, ములకలపల్లి, దుగ్గొండి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఐదు కేసులు ఉన్నట్లు గుర్తించారు. మరో నిందితుడు లావుడియా శ్రీధర్‌పై రెండు దొంగతనం కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### మేకల దొంగతనమే ప్రధాన లక్ష్యం

పోలీసుల విచారణలో నిందితులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఒడ్డురామారం గ్రామానికి చెందిన వారిగా తేలింది. నలుగురూ కలిసి హోండా అమేజ్ కారులో కురవి, మరిపెడ ప్రాంతాల్లో రాత్రివేళల్లో తిరుగుతూ మేకలు, గొర్రెలను దొంగతనం చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు సీఐ తెలిపారు.ఇదే క్రమంలో ఎల్లారిగూడెం గ్రామంలోని ఓ ఇంటి వద్ద ఉన్న మేకలను దొంగతనం చేసి కారులో కుక్కి తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారని వెల్లడించారు. జల్సాలకు అలవాటు పడి కష్టపడకుండా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో మేకల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.


నిందితుల వివరాలు

1. భూక్యా జగదీష్ (33) -- తండ్రి రాములు, వ్యవసాయం, ఒడ్డురామారం గ్రామం, పూసుగూడెం పంచాయతీ, ములకలపల్లి మండలం.
2. ధారావత్ అశోక్ -- తండ్రి రాములు, కారు డ్రైవర్, ఒడ్డురామారం గ్రామం, పూసుగూడెం పంచాయతీ, ములకలపల్లి మండలం.
3. భూక్యా ప్రసాద్ (25) -- తండ్రి సక్రు, కూలీ, ఒడ్డురామారం గ్రామం, పూసుగూడెం పంచాయతీ, ములకలపల్లి మండలం.
4. లావుడియా శ్రీధర్ (28) -- తండ్రి బాలు, తాపీ మేస్త్రీ, ఒడ్డురామారం గ్రామం, పూసుగూడెం పంచాయతీ, ములకలపల్లి మండలం.

రూ.లక్ష విలువైన మేకలు స్వాధీనం

నిందితుల నుంచి సుమారు రూ.లక్ష విలువైన ఏడు మేకలు, ఒక హోండా అమేజ్ కారు, మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ ఎల్. పవన్‌కుమార్ తెలిపారు.ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న మరిపెడ ఎస్ఐ గంద్రాతి సతీష్, కానిస్టేబుల్ జి. రవితేజతో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పి. ఐపీఎస్, తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ అభినందించారు. రాత్రివేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వాహనాలు, వ్యక్తులపై నిఘా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

# గ్రామ పంచాయతీలు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి






**వలిగొండ, సెప్టెంబర్ 01 (దేశ టైమ్స్):**

గ్రామ పంచాయతీలు సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని స్థానిక ఎంపిడిఓ జలంధర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక మండల స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శుల నుంచి సేకరించి ప్రణాళికలో పొందుపరిచారు.మండలంలోని గ్రామ పంచాయతీలను నాలుగు బాగాలుగా విభజించి సంబంధిత అధికారుల సమన్వయంతో ప్రణాళిక తయారీ ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతి రాజ్ ఏఈ సందీప్ రెడ్డి, ఏపిఓ పరుశురాం, ఏపియం అంజయ్య, ఏఈ ఆర్ డబ్ల్యు ఎస్ కీర్తి, పంచాయతి కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280